హెచ్‌ఎంపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలి

రంగారెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాదిగ జేఏసీ నాయకులు

ఆదిబట్ల, జనవరి 2 : తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కంబాలపల్లి రాములుపై దాడి చేసిన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే నిందితులను అరెస్టు చేయాలని మాదిగ జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ మంచాల మండల అధ్యక్షుడు కంబాలపల్లి భాస్కర్, నాయకుడు బండమీది కృష్ణ మాట్లాడుతూ.. డిసెంబర్ 23న తుక్కుగూడ జడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి విద్యార్థి అయ్యప్ప మాల వేసుకున్నాడు. ఆ విద్యార్థి చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడి రాములు కాలు విద్యార్థికి తగిలిందని ఆరోపిస్తూ 30 మంది ఆయనపై దాడి చేశారన్నారు. అనంతరం హెచ్‌ఎంతో ఆ విద్యార్థి కాళ్లు మొక్కించారన్నారు. దాడిలో హెచ్‌ఎం తీవ్రంగా గాయపడినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఈ ఘటనపై పహాడిషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినా ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయలేదన్నారు. వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాదిగ జేఏసీ నాయకులు పల్లాటి యాదయ్య, బోడ కృష్ణ, పల్లాటి సుధాకర్, ఏర్పుల శ్రీను, జోగు అంజయ్య, దచ్చిక భిక్షపతి, కొంకాని లింగం, భిక్షపతి, శ్రీకాంత్, పెద్దగారి శ్రీకాంత్‌తో పాటు నాయకులు ఉన్నారు.

జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మించాలి

ఆమనగల్లు : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు గురువారం రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్ మాట్లాడుతూ.. 23 ఏండ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం లేక చెట్ల కింద పాఠాలను బోధిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జగన్ నాయకులు చరణ్, శ్రీకాంత్, స్టాలిన్, వంశీ, పవన్ ఉన్నారు.

బర్డన్‌కు సీపీఐ నివాళి

నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పెద్దఅంబర్‌పేట, జనవరి 2: మున్సిపాలిటీ పరిధిలోని రావినారాయణరెడ్డి కాలనీ ఫేజ్-3 భూపోరాట కేంద్రంలో గురువారం సీపీఐ జాతీయ నాయకుడు ఏబీ బర్దన్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థి దశనుంచే ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు ఆందోజు రవీంద్రాచారి, ముత్యాల యాదిరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు అజ్మీర హరిసింగ్‌నాయక్, ప్రసాద్, నర్సింహ, సైదులు, వినోద్ నాయక్, యాదగిరి, వీరరేశ్, శంకర్‌నాయక్, అరుణ, దేవమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మాజీ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి

కందుకూరు, జనవరి 2 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సూచించారు. నూతన సంవత్సరంలో బీఆర్ఎస్ పార్టీకి అంతా మంచి జరుగుతుందని ఆకాంక్షించారు. గురువారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, మాజీ యువజన నాయకులు పొలెమోని అశోక్ ముదిరాజ్, మండల మహిళా అధ్యక్షురాలు తాండ్ర ఇందిరమ్మ దేవేందర్, మాజీ సర్పంచ్ జంగయ్య, పరంజ్యోతి, నవీన్, బర్కం వెంకటేశ్ తదితరులు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో పాటు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానం చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను రెపరెపలాడించాలని కోరారు. పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు గోవర్ధన్, పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఆర్థిక సహాయం

ఆర్కేపురం, జనవరి 23 : ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ నిరుపేద కుటుంబానికి చెందిన చందన అనే యువ క్రికెట్ క్రీడాకారిణి అండర్ 23 ఎంపికైంది. చందనకు సామాజిక సేవా వేత్త చిలుక ఉపేందర్‌రెడ్డి ఆధునిక క్రికెట్ కిట్టు కొనుగోలు కోసం రూ.25వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ, నైపుణ్యాలు ఉండేవారికి పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశంతోనే పేద విద్యార్థులకు, క్రీడాకారులకు చేయూతను అందించడానికి ఎల్లవేళలా ముందుంటానని తెలిపారు. క్రికెట్‌లో చందన సత్తా చాటి దేశానికి, రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి లింగస్వామిగౌడ్, జగిని రమేశ్‌గుప్తా, శ్యామ్, విప్లవ్, శ్రీకాంత్, కిషన్, సంతోష్ తదితరులు ఉన్నారు.

నేడు అస్పల్లిగూడలో ఆయిల్ పామ్ సాగు

షాబాద్, జనవరి 2 : షాబాద్ మండల పరిధిలో శుక్రవారం ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు చేవెళ్ల డివిజన్ ఉద్యాన వన శాఖ అధికారి కీర్తన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మండల పరిధిలోని అస్పల్లిగూడ గ్రామంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటేందుకు రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు హాజరు కానున్నట్లు చెప్పారు. రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

జానారెడ్డికి డాక్టరేట్

ఆర్కేపురం, జనవరి 2 : గణిత శాస్త్రంలో నాన్-న్యూటోనియన్ ఫ్లూ యిడ్ ఫ్లో ప్రాబ్లమ్స్ ఓవర్ ఏ స్ట్రేచింగ్ షీట్ ఇన్ ప్రెజెన్స్ ఆఫ్ మాగ్నటిక్ ఫీల్డ్ అను అంశంలో చేసిన పరిశోధనకు గాను కొత్తపేటకు చెందిన సంకిరెడ్డి జానారెడ్డికి తమిళనాడులోని అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. అన్నామలై యూనివర్సిటీ గణిత శాస్త్ర ఆచార్యుడు డాక్టర్ వలసమీ, వర్ధమాన ఇంజినీరింగ్ కళాశాల గణిత శాస్త్ర ఆ చార్యుడు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనలను గుర్తించి అన్నామలై యూనివర్సిటీ జా నారెడ్డికి ఈ డాక్టరేట్‌ను చేసింది. సామాన్య రైతు కుటుం బం నుంచి వచ్చిన జనారెడ్డి డాక్టరేట్ పట్టా పొందడంపై కుటుంబ సభ్యులు స్నేహితులు, సహ అధ్యాపకులు అభి నందనలు తెలిపారు. జానారెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహి స్తున్నాడు.

ఏఎస్పీని కలిసిన డైరెక్టర్లు

అడిషనల్ ఎస్పీ సంజీవరావుతో డైరెక్టర్లు

మంచాల, జనవరి 2 : మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్లు వేణుగోపాల్ రావు, జెనిగ వెంకటేశ్ గురువారం సంగారెడ్డి అడిషనల్ ఎస్పీ సంజీవరావును ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా షాలువా కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పల్లుట్లలో సీపీఐ జెండా ఆవిష్కరణ

సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

చేవెళ్ల రూరల్, జనవరి 2 : సీపీఐ వందేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామ గ్రామాన పార్టీ జెండాలను ఆవిష్కరిస్తున్నారు. చేవెళ్ల మండల పరిధిలోని పల్లుట్లలో గురువారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. భారతదేశంలో వంద వసంతాలు పూర్తి చేసుకున్న ఒకే ఒక్క పార్టీ సీపీఐ అని, సీపీఐ పేదల పక్షాన నిరంతరం పోరాడుతున్నదన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పార్టీ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, మొయినాబాద్ మండల కార్యదర్శి శ్రీనివాస్, శంకర్‌పల్లి మండల కార్యదర్శి సుధీర్, బీకేయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, ఐఐటీయూసీ మండల నాయకుడు యాదగిరి, మహిళా సంఘం వర్కింగ్ మండల అధ్యక్షుడు మంజుల, ఆశ వర్కర్లు మీనాక్షి, కళావతి, పద్మ, రఘు, సత్తయ్య, యాదమ్మ పాల్గొన్నారు.

బలిజగూడకు బస్సు సౌకర్యం కల్పించాలి

హయత్‌నగర్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 2 : మండల పరిధిలోని బలిజగూడకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు గురువారం హయత్‌నగర్ డిపో మేనేజర్ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్పందించిన డీఎం బస్సు సౌకర్యం కల్పించేందుకు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామస్తులు ఉప్పు వెంకటేశ్, బల్లెపు సతీశ్‌కుమార్, పవన్, సందీప్, సాయికుమార్ ఉన్నారు.

ఆటో బోల్తా .. ఒకరు మృతి

9మందికి తీవ్రగాయాలు

షాద్‌నగర్, జనవరి 2: షాద్‌నగర్ నియోజకవర్గం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లాల్‌పహాడ్ నుంచి చౌదర్‌గూడ మండలం వైపు వెళ్తున్న ఆటో తుమ్మలపల్లి గేటు వద్ద బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తుమ్మలపల్లికి చెందిన జంగయ్యపై ఆటో పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానికులు షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ రోడ్డు ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

తప్పిన ప్రమాదం..

మాంజా తగిలి దంపతులకు గాయాలు

షాద్‌నగర్, జనవరి 2: పతంగులను ఎగురవేసే మాంజా మెడకు, చేతికి తగిలి దంపతులు గాయపడిన ఘటన నందిగామ సమీపంలో పాత జాతీయ రహదారిపై వెలుగుచూసింది. బాధితుడి కథనం ప్రకారం.. షాద్‌నగర్‌కు చెందిన రఘునాథ్, సంతోషిణి అనే దంపతులు బైక్‌పై బుధవారం శంషాబాద్ మండల పరిధిలోని ముచ్చింతల్ ఆలయ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా నందిగామ సమీపంలోకి రాగానే పాత జాతీయ రహదారిపై పతంగి ఎగరవేసిన మాంజా రఘునాథ్ మెడకు తగిలి గాయాలయ్యాయి. గమనించిన భార్య సంతోషిణి మాంజాను తప్పించే క్రమంలో ఆమె రెండు చేతులకు గాయాలయ్యాయి. బైకు వేగాన్ని అదుపు చేసి పక్కకు ఆపడంతో పెను ప్రమాదం తప్పిందని, లేకుంటే మాంజా తగిలి మెడకు తీవ్ర గాయాలై చనిపోయే ప్రమాదం ఉండేదని బాధితుడు ఆందోళన వ్యక్తం చేశాడు. గాయపడిన దంపతులను వైద్యం కోసం షాద్‌నగర్ సర్కార్ దవాఖానకు తరలించారు.

యువకుడు ఆత్మహత్య

మంచాల, జనవరి 2 : మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలోని చెన్నారెడ్డిగూడలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై లాలయ్య తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కావలి ప్రవీణ్ (20) గురువారం తనకు ఉన్న పశువులను బావి సమీపంలో కట్టివేశాడు. అనంతరం పక్కనే ఉన్న పశువుల కొట్టంలో ఉరి వేసుకున్నాడు. ప్రవీణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ దవాఖానకు తరలించిన అనంతరం బంధువులకు అప్పగించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, క్రీడాకారులు

కడ్తాల్, జనవరి 2 : మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తండ్రి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం మండల కేంద్రంలో గురువారం కడ్తాల్ ప్రీమియర్ లీగ్ సీజన్-3 క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నమెంటును నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

షాబాద్, జనవరి 2: గ్రామాల్లోని పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీటీసీ పర్వేద మల్లేశ్ అన్నారు. గురువారంమండల పరిధిలోని బొబ్బిలిలో చేవెళ్ల పట్టణానికి చెందిన పీఎంఆర్ మెడికల్ దవాఖాన వైద్యులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో గ్రామానికి చెందిన సుమారు 302 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 43 మందిని ఆపరేషన్ కోసం గుర్తించగా, వారిని సోమవారం చేవెళ్ల పీఎంఆర్ దవాఖానకు తీసుకువెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలి

శ్రీరామ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 2: సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి అన్నారు. క్లబ్ 23వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అలాగే విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్లబ్ స్థాపించి 23 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. వివిధ కాలనీల సమస్యల పరిష్కారం కోసం కీలక పాత్ర పోషిస్తున్నామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.శంకర్ మాట్లాడుతూ క్లబ్ స్వచ్ఛందంగా ముందుకొచ్చి పాఠశాలలో సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సలహాదారులు కొంపల్లి జగదీష్, రాజు, కె.కృష్ణారెడ్డి, కిశోర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

కల్పన (ఫైల్)

కొత్తూరు, జనవరి 2 : ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఓ యువతి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఈ ఘటన కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లాపూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన చిర్ర యాదయ్యతో మహేశ్వరం మండల పరిధిలోని కల్వకోలు చెందిన కల్పన (26)కు తొమ్మిదేండ్ల క్రితం వివాహం అయింది. వీరికి ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. కల్పనకు తరచూ కడుపు నొప్పి వస్తుండేది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 31న సాయంత్రం క్రిమిసంహార మందు తాగడంతో చికిత్స కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిం ది. కల్పన తండ్రి కొండరి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

శంషాబాద్ రూరల్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. డిసెంబర్ 29న హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారిలో శంషాబాద్ మండలంలోని గండిగూడ వద్ద నిలబడి ఉన్న టీఎస్ 07జీఎల్ 9819 బోర్‌వెల్ వాహనం చెడిపోవడంతో రోడ్డు పక్కన నిలిపారు.అదే సమయం లో శంషాబాద్ వైపు నుంచి షాద్‌నగర్ వైపు వెళ్తున్న టీఎస్ 15ఎఫ్‌డీ 3207 నంబర్‌గల బైక్ ఢీకొనడంతో బైక్‌పై వస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం వారిని ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ డిసెంబర్ 31న నర్సింహ అనే వ్యక్తి మృతి చెందాడు. దీంతో గాయపడి చికిత్స పొందుతున్న శ్రీనివాస్ నుంచి కొన్ని వివరాలు సేకరించగా నర్సింహ అనే వ్యక్తి తనకు ఒక్కరోజు ముందు లేబర్ అడ్డాలో పరిచయం అయిన్నట్లు తెలిపారు. ఇద్దరం కలిసి వనపర్తి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగిన్నట్లు పోలీసులకు వివరించారు. నర్సింహ అనే వ్యక్తి బైక్‌ను ఐడియా బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగలించి పారిపోతున్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. నర్సింహ పూర్తి వివరాల కోసం విచారణ చేపడుతున్నామన్నారు. ఐడియా బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో బైక్ పోగొట్టుకున్న వ్యక్తి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే శంషాబాద్ పోలీస్‌స్టేషన్ 94906 17213, 871266 3308 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బాలికపై అత్యాచార యత్నం

మొయినాబాద్, జనవరి 2 : అభం..శుభం తులియని ఓ బాలికపై ఓ యువకుడు అత్యాచార యత్నం చేశాడు. పాప అరుపులతో యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ దారుణ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గద్వాల జిల్లాలోని ధరూరు మండల పరిధిలోని అల్లపాడు గ్రామానికి చెందిన దంపతులు కొంత కాలం క్రితం మొయినాబాద్‌కు వలస వచ్చారు. గురువారం సాయంత్రం బాలిక (4) బహిర్భూమికి వెళ్లింది. గమనించిన చిలుకూరు గ్రామానికి చెందిన యశ్వంత్ కుమారుడు కైలాశ్ అనే యువకుడు ఆ బాలికను చెట్టు చాటుకు తీసుకెళ్లి అత్యాచార యత్నానికి పాల్పడుతుండగా కేకలు వేసింది. దంపతుల పెద్ద కుమార్తె గమనించి తల్లిదండ్రులకు చెప్పింది. వారు వచ్చేసరికి ఆ యువకుడు పారిపోవడానికి యత్నించాడు. చుట్టు పక్కల వారు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

సమష్టికృషి వల్లే ఉన్నత స్థాయికి .. వజ్రోత్సవాలు, నూతన సంవత్సర వేడుకలను ఉత్సాహంగా పూర్తి చేసిన సభ్యులంతా అదే సమష్టికృషితో పనిచేస్తే దేశంలోనే మన వర్సిటీకి మంచి పేరు తీసుకురాగలమని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి అల్దాస్ జానయ్య అన్నారు. గురువారం ఆయన ఉద్యోగుల సమక్షంలో నూతన సంవత్సరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. – వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 2

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

యాచారం, జనవరి 2: మండల పరిధిలోని నందివనపర్తి 11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆ శాఖ అధికారులు తెలిపారు. అయ్యవారిగూడ ఫీడర్‌మీద చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల దృష్టా అయ్యవారిగూడ, నజ్దిక్‌సింగారం గ్రామాలు, వ్యవసాయ పొలాలకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

శంషాబాద్ పరిధిలో..

శంషాబాద్ రూరల్ : మండలంలోని వివిధ గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పెద్దషాపూర్ సబ్‌స్టేషన్ ఏఈ సురేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు తిరిగి 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రామంజాపూర్ ఫీడర్‌లో మండలంలోని కవేలిగూడ, రామంజాపూర్,బోటిగూడ, రామంజాపూర్‌తండా గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో నిలిపివేస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

అమ్మో.. మళ్లీ వైరల్ జ్వరాలు

అనేక మందికి దగ్గు..జ్వరం..జలుబు లక్షణాలు.. రోగులతో నిండిపోతున్న వైద్యశాలలు..

వాతావరణంలో మార్పులే కారణమంటున్న వైద్యనిపుణులు..జాగ్రత్తలు పాటించాలంటూ సూచన

సిటీబ్యూరో: నగరంలో మళ్లీ వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. చాలా మంది జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలతో దవాఖానలకు క్యూ కడుతున్నారు. దీంతో గ్రేటర్ పరిధిలోని బస్తీ దవాఖానలు, ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా, జిల్లా దవాఖానలు రోగులతో నిండిపోతున్నాయి. రెండు మూడు రోజుల నుంచి ఓపీ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు ఆయా ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, జ్వరం, ఒంటి నొప్పులు వంటి లక్షణాలతో రోగులు దవాఖానకు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. వీరితో పాటు ఆస్తమా వంటి ఊపరితిత్తుల సంబంధిత వ్యాధులతో బాధపడే రోగులు సైతం అనారోగ్యానికి గురవుతున్నట్లు వైద్యులు తెలిపారు.

వాతావరణ మార్పుల వల్లే..

వాతావరణంలో ఏర్పడుతున్న మార్పుల వల్లే ఫ్లూ వంటి సీజనల్ వ్యాధులు వస్తున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే వానాకాలం, చలికాలంలో సీజనల్ వ్యాధులు రావడం సర్వసాధారణమేనని, అలాగని సీజనల్ వ్యాధులను నిర్లక్ష్యం చేయకూడదని సూచిస్తున్నారు వైద్యులు. సకాలంలో చికిత్స తీసుకుంటే రెండు నుంచి మూడు రోజుల్లో వ్యాధి నయమవుతుందని, నిర్లక్ష్యం చేస్తే అది ఇతర అనారోగ్య సమస్యలకు దారితీసే అవకాశాలు లేకపోలేదని చెబుతున్నారు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశ మున్నందున ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని, చల్లటి వాతావరణానికి ఎక్కువగా ప్రభావితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఆస్తమా వంటి ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులతో బాధపడే రోగులు, అలర్జీ బాధిత రోగులకు ఈ చలికాలం ఒక గడ్డుకాలంగా చెప్పవచ్చని, వీరు చాలా జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించండి

చల్లని పానీయాలకు దూరంగా ఉండడం మంచిది. ఎప్పటికప్పుడు వండిన వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలి.చలికి ఎక్కువగా ప్రభావితం కాకుండా జాగ్రత్తపడాలి. ద్విచక్ర వాహనాలపై పిల్లలను స్కూళ్లకు తీసుకెళ్లేటప్పుడు తల్లిదండ్రులు తప్పనిసరిగా వారి చెవులకు టోపీలు లేదా మఫ్లర్లు, స్వెట్టర్ వంటి వెచ్చని దుస్తువులు వేయించాలి పిల్లలు, వృద్ధులు, ఊపిరితిత్తుల సమస్యలున్న వారు అప్రమత్తంగా ఉండాలి.తేలికపాటి లక్షణాలున్నప్పుడే వైద్యులను సంప్రదించాలి.